సాక్షి అన్నమయ్య జిల్లా

ఆదివారం । 4 । మే । 2025



ఉపాధి పనుల్లో చేతివాటం
గ్రామాల నుంచి వలసలను నివారించేందుకు ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకం లక్ష్యం తప్పుతోంది. అధికార పార్టీ పేరు చెప్పి ఫీల్డ్ అసిస్టెంట్లు దండుకుంటున్నారు.
-IIలో



అశ్వవాహనంపై హరిహరులు
పుష్పగిరిలో బ్రహ్మోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. శనివారం స్వామివార్లు అశ్వ వాహనాలపై దర్శనమిచ్చారు.
-IIలో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.80	రూ.90
రెండోరకం	రూ.60	రూ.70

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 481 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

అర్జీలకు సత్వరమే పరిష్కారం
రామాపురం: ప్రజాసమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ వసతి గృహంలో మంత్రి ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భం ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వీటిని పరిశీలించి, పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నేడు విజయవాడ నుంచి కడపకు ప్రత్యేక బస్సు
కడప కోటిరెడ్డిసర్కిల్: నీట్ పరీక్షలు రాస్తున్న విద్యార్థుల సౌకర్యార్థం ఆదివారం రాత్రి 9.45 గంటలకు విజయవాడ నుంచి కడపకు ప్రత్యేక సూపర్ లగ్జరీ సర్వీసును నడపుతున్నామని ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఈ బస్సు ఒంగోలు, కావలి, బద్వేలు మీదుగా కడపకు చేరుతుందన్నారు. ప్రయాణికులు, విద్యార్థులు ఈ ప్రత్యేక సర్వీసును సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నియామకాలు
కడప కోటిరెడ్డిసర్కిల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీలో అన్నమయ్య జిల్లా వాసులకు చోటు కల్పించారు. ఈ మేరకు శనివారం పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. రాజంపేటకు చెందిన కొట్టిక రాజమోహన్‌ను రాష్ట్ర బీసీ సెల్ జనరల్ సెక్రటరీగా, షేక్ మహమ్మద్ జాహిద్ అలీని రాష్ట్ర మైనార్టీ సెల్ సెక్రటరీగా, జింకా ఓబయ్యను రాష్ట్ర వాణిజ్య విభాగం సెక్రటరీగా, మదనపల్లెకు చెందిన ఎం.భారతి జయకుమారిని రాష్ట్ర అంగన్వాడీ విభాగం సెక్రటరీగా, రాజంపేటకు చెందిన మడితాటి సురేంద్రారెడ్డిని రాష్ట్ర ఉద్యోగ, పెన్షనర్ల విభాగం సెక్రటరీగా, మదనపల్లెకు చెందిన ఎస్.జగన్నాథరెడ్డిని రాష్ట్ర ఉద్యోగ, పెన్షనర్ల విభాగం జాయింట్ సెక్రటరీగా నియమించారు.


గాలులతో విద్యుత్‌శాఖకు రూ. 30లక్షల నష్టం



మాట్లాడుతున్న ఎస్‌పీఎస్పీడీసీఎల్ ఈఈ హరిసేవ్యానాయక్

సిద్దవటం: మండలంలో గురువారం సాయంత్రం అకాల వర్షం, గాలులకు విద్యుత్ శాఖకు దాదాపు రూ. 30 లక్షల మేర నష్టం వాటిల్లిందని ఏపీఎస్పీడీసీఎల్ కడప ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హరిసేవ్యానాయక్ తెలిపారు. సిద్దవటం మండలం బొగ్గిడివారిపల్లెలో శనివారం ఆయన విద్యుత్ మరమ్మతు పనులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యం వల్ల పెద్ద వృక్షాలు విద్యుత్ లైన్లపై పడటంతో 100 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయన్నారు. 10 ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయన్నారు. 4 కిలోమీటర్ల మేర విద్యుత్‌లైన్ దెబ్బతిందన్నారు. ఈమేరకు దాదాపు రూ. 30 లక్షల మేర విద్యుత్ శాఖకు నష్టం వాటిల్లిందన్నారు. గృహ వినియోగ దారులకు, వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేసేందుకు సిబ్బంది శ్రమిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఒంటిమిట్ట డీఈ సుబ్రమణ్యం, సిద్దవటం, ఒంటిమిట్ట ఏఈలు జయచంద్ర, ఉదయ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యసాధనకు కష్టపడాలి



మాట్లాడుతున్న శ్రీకాంత్ కె అరిమానిత్య

కురబలకోట: చదువు సంధ్యలనేవి జీవితాన్ని ఉన్నతంగా మలుచుకునేందుకు మహత్తరమైన అవకాశమని బెంగళూరు జర్నీ ల్యాబ్స్‌చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీకాంత్ కె అరిమానిత్య అన్నారు.విద్యార్థులు లక్ష్యసాధనకు కష్టపడాలని సూచించారు. అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల 27వ వార్షికోత్సవ వేడుకలు శనివారం రాత్రి నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన ఆవిష్కరణలు విద్యార్థుల కేరీర్‌ను మలుపు తిప్పుతాయన్నారు. డిజిటల్ పరివర్తన, ఏఐ, ఆటోమేషన్ తదితర టెక్నాలజీల గురించి అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యార్థుల ఆలోచనలే వారి భవిష్యత్తును నిర్దేశిస్తాయన్నారు. పోటీ ప్రపంచంలో రాణించాలంటే క్రమ శిక్షణ, కష్టపడే తత్వం కలిగి ఉండాలన్నారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎన్. విజయభాస్కర్ చౌదరి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు టెక్నాలజీనే ఆధారంగా నిలుస్తోందన్నారు. నేడు నేర్చుకునే ప్రతి పాఠం రేపటి భవిష్యత్తుకు పునాదిగా మారుతుందన్నారు. ఇన్నోవేటివ్‌గా ఆలోచిస్తే పైకి ఎదగవచ్చన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ట్రిపుల్ ఆర్ ప్రెసిడెంట్ నాదెళ్ల ద్వారకనాథ్, ప్రిన్సిపాల్ యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాందీ షాపులే.. బార్‌లా!

- ఎక్కడ చూసినా వైన్ షాపుల వద్ద సెపరేట్ రూములు
- పర్మిషన్ లేకపోయినా ఎవరు ఏమి చేయలేరన్న ధీమా
- జిల్లాలో అధిక శాతం కూటమినేతలకే వైన్ షాపులు
- ఎక్సైజ్ శాఖ అధికారులకు తెలిసినా పట్టించుకోని వైనం





జిల్లాలోని ఓ మద్యం దుకాణం వద్ద ఏర్పాటు చేసిన పర్మిట్ రూములోని దృశ్యం (ఇన్‌సెట్) తరలించేందుకు సిద్ధంగా సంచుల్లో మద్యం సీసాలు


సాక్షి రాయచోటి: రాష్ట్రంలో కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత తెలుగు తమ్ముళ్లు ఆర్థికంగా బలపడేందుకు అక్రమార్గాల్లో ముందుకు పోతున్నారు. అధికారంలో ఉండగానే అన్నీ చక్కబెట్టుకోవాలన్నట్లు అవకాశం ఉన్న ప్రతి అంశంపై కన్నేస్తున్నారు. ప్రధానంగా ఇసుక, మద్యం, మట్టి, గ్రావెల్ ఇలా అన్నింటిలోనూ దోపిడీకి స్కెచ్ వేశారు.అయితే మద్యం దుకాణాలు జిల్లాలో ఎక్కువ శాతం కూటమి సర్కార్‌లోని సంబంధీకులకే రావడంతోవారు ఆడిందే ఆట..పాడిందే పాటగా సాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం మద్యం దుకాణాల పక్కన పర్మిట్ రూములకు అనుమతులు లేవని...బెల్ట్ షాపులను లేకుండా చేస్తున్నామని పేర్కొంటున్నా కిందిస్థాయిలో పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉంది. మద్యం దుకాణాల వద్ద ఎక్కడ చూసినా పర్మిట్ రూములు, ఎమ్మార్పీ ధరల ఉల్లంఘన కొనసాగుతోంది. జిల్లా వ్యాప్తంగా అనధికార బెల్ట్ షాపులతో మద్యం వ్యాపారం మూడు క్వార్టర్లు..ఆరు బీర్లుగా విరాజిల్లుతోంది. అధికారులు ఇచ్చిన సమయపాలనను కూడా ఇటు బార్లుగానీ, అటు వైన్‌షాపులకు సంబంధించిన వారు ఎవరూ పట్టించుకోకుండా ఉదయం నుంచే అమ్మకాలు సాగిస్తున్నారు.

మద్యం దుకాణాల ప్రక్కన పర్మిట్ రూములు

జిల్లాలో కూటమి సర్కార్‌లోని నియోజకవర్గ ఎమ్మెల్యేలు, ఇతర నేతలు, వారి అనుచరులకే మద్యం దుకాణాలు దక్కాయి. దీంతో ఎవరూ అడ్డుకోలేరనే ఉద్దేశంతో ఎక్కడికక్కడ మద్యం దుకాణాల పక్కన పర్మిట్ రూములు పెట్టి నడిపిస్తున్నారు. ప్రభుత్వం మాత్రం పర్మిట్ రూములకు అనుమతులు లేవని మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నా లోపల మాత్రం యధేచ్ఛగా కూర్చొబెట్టి తాపిస్తున్నారు. ఎక్సైజ్‌శాఖ అధికారులు మాత్రం చూసీచూడనట్లు...వినబడినా వినబడనట్లు ముందుకు పోతున్నారు. జిల్లా వ్యాప్తంగా 120కి పైగా మద్యం షాపులు ఉన్నా ఏదో కొన్నిచోట్ల మినహా మిగిలిన అన్ని ప్రాంతాల్లో పర్మిట్ రూములను ఏర్పాటు చేశారు.

ఎమ్మార్పీ ధరలకు మంగళం
జిల్లాలోని మద్యం దుకాణాల్లో పలుచోట్ల బాటిల్‌పై ఎమ్మార్పీ ధర కాకుండా రూ. 10–30లకు అదనంగా వసూలు చేస్తున్నారు. కొన్నిచోట్ల సాధారణ ధరలకే విక్రయాలు సాగిస్తున్నా మరి కొన్నిచోట్ల బీరు, ఇతర మద్యం బాటిళ్లపై చిల క్కొట్టుడు కొడుతున్నారు. పైగా షాపుల వారికి అధికార బలం ఉండడంతోఎక్సైజ్ అధికారులు కూడా వేగంగా స్పందించలేకున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇంత మొత్తం అని కాకుండా పెద్ద ఎత్తున ధరలు పెంచి విక్రయిస్తున్నా అడిగే వారు లేకపోవడంతో ఎవరూ పట్టించుకోని పరిస్థితి నెలకొంది.

బెల్ట్ షాపుల జోరు



జిల్లాలో బెల్ట్‌షాపుల జోరు అధికంగా కనిపిస్తోంది. ప్రభుత్వం ఎక్కువ ధరలు వసూలు చేస్తుండడం.. ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం వైన్ షాపులకు పోటీలు పెరగడంతో ఎక్కువ మొత్తంలో పలికిన షాపులకు సంబంధించి గిట్టుబాటు కాదని బెల్ట్‌షాపులకు తెర తీస్తున్నారు. షాపు నుంచి తీసుకెళ్లండి..లోకల్‌గా అంగళ్లు పెట్టుకోండని అన్న తరహాలో వ్యాపారాన్ని విస్తరిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 1000–1200 బెల్ట్ షాపులు ఉన్నట్లు ఎక్సైజ్ శాఖ అధికారిక లెక్క కట్టింది. ప్రధానంగా తంబళ్లపల్లె నియోజకవర్గంతోపాటు మదనపల్లె, రాజంపేట, రైల్వేకోడూరు, రాయచోటి, పీలేరు ఇలా అన్ని ప్రాంతాల్లోనూ బెల్ట్ షాపుల జోరు కొనసాగుతోంది. తంబళ్లపల్లె నియోజకవర్గంలో కొంతమేర అధికంగా బెల్ట్‌షాపులు కనిపిస్తున్నాయి. అంతేకాకుండా రాయచోటి ప్రాంతంలో మొబైల్ వాహనం ద్వారా కోరుకున్న చోటుకే మద్యం విక్రయాలు సాగిస్తున్నారు. బెల్ట్‌షాపుల విషయంలో మాత్రం పట్టణాల నుంచి పల్లెల వరకు పాకినా ఎవరూ నోరు మెదపని పరిస్థితి నెలకొంది.

మద్య నియంత్రణ పాటించాలి



జిల్లాలో మద్య నియంత్రణకు అధికారులు చర్యలు చేపట్టాలి. ఎందుకంటే విచ్చలవిడగా పర్మిట్ రూములు పెట్టి తాగించడం...బెల్ట్ షాపుల ద్వారా పల్లెలకు కూడా సరుకులు చేరవేస్తుండడంతో గ్రామాల్లో తాగి కొట్టుకుంటున్నారు. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విచ్చలవిడగా మద్యం పారించడమే లక్ష్యంగా పనిచేస్తోంది. తద్వారా ఆయా కుటుంబాల్లో సమస్యలు ఉత్పన్నమతున్నాయి.

–ఆకేపాటి అమరనాథరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే, రాజంపేట

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు
జిల్లాలో మద్యం దుకాణ యజమానులకు సంబంధించి ఎవరైనా పర్మిట్ రూములు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవు. అంతేకాకుండా ఎమ్మార్పీ ధర, సమయ పాలన పాటించాలి. అక్రమ మద్యానికి సంబంధించి ఇప్పటివరకు 96 కేసులు నమోదు చేసి 283.125 లీటర్ల మద్యాన్ని సీజ్ చేశాం. రెండు వాహనాలను కూడా సీజ్ చేశాం. బెల్ట్ షాపులకు సంబంధించి కూడా 61 కేసులు నమోదు చేసి కట్టడికి చర్యలు తీసుకుంటున్నాము. నవోదయంలో భాగంగా నాటుసారా వద్దు–కుటుంబమే ముద్దు పేరుతో కార్యక్రమాలు చేపడుతున్నాం.

– మధుసూదన్‌రావు, సూపరింటిండెంట్, ఎక్సైజ్‌శాఖ, రాయచోటి, అన్నమయ్య జిల్లా

ఎల్లమ్మతల్లీ.. కరుణించమ్మా..



ప్రత్యేక అలంకరణలో ఎల్లమ్మతల్లి

పెనగలూరు: ఎల్లమ్మ తల్లీ కరుణించమ్మా.. మమ్మేలు తల్లీ.. అంటూ భక్తులు అమ్మను కొలిచారు. పెనగలూరు మండలంలోని సింగనమల గ్రామంలో ఎల్లమ్మతల్లి జాతర శుక్రవారం రాత్రి ప్రారంభమైంది. మూడు రోజులపాటు జరిగే జాతరకు సుదూర ప్రాంతాల నుంచి బంధుమిత్రులు రావడంతో గ్రామంలో సందడి నెలకొంది. ఆలయాన్ని విద్యుత్‌దీపాలతో అలంకరించారు.శనివారం సాయంత్రం ఎల్లమ్మ తల్లిని గ్రామంలో ఊరేగించారు. అనంతరం గంగమ్మ, అంకాలమ్మ, మారమ్మ విగ్రహాలను తీసుకొచ్చి గ్రామ చావిడి వద్ద తాత్కాలికంగా వేపాకులతో ఆలయాలు నిర్మించి అక్కడ అమ్మవార్లను ఉంచి ప్రత్యేక పూజలు జరిపారు. శనివారం రాత్రి భక్తులు పొంగళ్లు సమర్పించారు.ఆదివారం కూడా పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకుంటారని గ్రామస్తులు తెలిపారు. 41 సంవత్సరాల తర్వాత జాతర నిర్వహించడంతో ప్రాధాన్యత సంతరించుకుంది.



విద్యుత్ దీపాలంకరణలో ఆలయం

ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించాలి

జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్

రాయచోటి: మండలాల్లో ప్రభుత్వ భూములకు తగిన విధంగా రక్షణ కల్పించాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శనివారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సబ్ కలెక్టర్లు, ఆర్డీఓ, తహసీల్దార్లతో రెవెన్యూ అంశాలపై కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రభుత్వ ఆక్రమిత భూముల గుర్తింపు, జీఓ ఎంఎస్ నంబర్.30 మార్గదర్శకాల మేరకు అభ్యంతరలేని ప్రభుత్వ భూములు ఆక్రమణ రెగ్యులరైజేషన్, రీ సర్వే, అందరికీ గృహనిర్మాణం దరఖాస్తులు స్వీకరణ, కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ల ఏర్పాటుకు భూముల గుర్తింపు తదితర అంశాలపై సమీక్షించారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పథకాలకు భూములు అవసరం అవుతాయని కలెక్టర్ సూచించారు. మండలాల వారీగా సమీక్షించి తగు సూచనలు జారీ చేశారు. ల్యాండ్ రెగ్యులరైజేషన్ పథకం 2025లో భాగంగా ప్రభుత్వం నూతనంగా జారీ చేసిన మార్గదర్శకాల మేరకు 2019 అక్టోబర్ 15కు ముందు ప్రభుత్వ భూములను అనధికారికంగా ఆక్రమించుకొని ఏర్పరుచుకున్న నివస గృహాలలో అభ్యంతరకరం లేని వాటిని క్రమబద్ధీకరణ అంశంలో గుర్తించిన యూనిట్లు, తీసుకున్న చర్యలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. అలాగే హౌసింగ్ రీ వెరిఫికేషన్ పెండింగ్ కూడా త్వరగా పూర్తి చేయాలన్నారు. జిల్లాలో పచ్చి మేతపెంపకానికి డివిజన్, మండల స్థాయిలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ, డికేటీ, ప్రైవేటు భూములను ప్రతి మండలంలో కనీసం 3 వేల ఎకరాలను గుర్తించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డీఆర్ఓ మధుసూదన్ రావు, సబ్ కలెక్టర్లు మేఘ స్వరూప్, వైఖోన్ నదియా దేవి, ఆర్డీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాల్లో చిరుత

భయాందోళనలో రైతులు





సింగన్నగారిపల్లె పొలాల్లో చిరుత సంచరించిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న రైతులు, ఫారెస్టు సిబ్బంది

కురబలకోట: జిల్లాలో మరోసారి చిరుత పులి సంచారం కలకలం రేపింది. శనివారం కురబలకోట మండలంలోని సింగన్నగారిపల్లె దగ్గర పొలాల్లో చిరుత సంచారం కలకలం రేపుతోంది. రామాంజులు అనే రైతు ఉదయం టమాటా పొలం వద్దకు వెళ్లాడు. చిరుత కనిపించడంతో భయంతో పక్కనున్న చెట్టు ఎక్కుదామని భావించాడు. అంతలోనే చిరుత సమీపంలోని రైల్వే బ్రిడ్జి వైపుగా వెళ్లి అటుగా పక్కనున్న గుట్టల్లోకి చేరుకున్నట్లు రైతు తెలిపారు. విచిత్రమేమంటే చిరుతను రైతు చూశాడు కాని అది ఇతన్ని చూడకుండా వెళ్లిపోవడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. వెంటనే అతను ఈ సంగతిని ఊరి వారికి చెప్పడంతో అంతా పులి సంచరించిన ప్రాంతానికి చేరుకున్నారు. పులి అడుగులను గుర్తించారు. ఫారెస్టు అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు హుటాహుటిన వచ్చారు. పులి అడుగు జాడలను గుర్తించారు. ఈప్రాంతంలో జింకలు సంచరిస్తుండడంతో వాటి కోసం చిరుత వచ్చి ఉంటుందని భావిస్తున్నారు. ఇదిలా ఉండగా పొలాల్లో పులి కనిపించిందన్న సమాచారంతో పరిసర ప్రాంత గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పొలాల వద్దకు రైతులు ఒంటరిగా వెళ్లకుండా కొన్నాళ్ల పాటు జాగ్రత్త వహించాలని ఫారెస్టు అధికారులు సూచించారు. పరిసర గ్రామాల్లో హార్సిలీహిల్స్, బురకాయలకోట సెక్షన్ ఫారెస్టు సిబ్బంది అవగాహన కల్పించారు. చిరుత ఒక చోట ఉండదని తిరుగుతూ ఉంటుందని అన్నారు.హార్సిలీహిల్స్ పరివాహక ప్రాంతం నుంచి ఇక్కడికి వచ్చి ఉంటుందని అధికారులు తెలిపారు.



సింగన్నగారిపల్లె పొలాల వద్ద చిరుత అడుగులు

ఎర్రచందనం అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా



స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలు, వాహనంతో పారెస్టు అధికారులు

ఒంటిమిట్ట: ఎర్రచందనం అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచామని, ఎర్రచందన తరలించే వారిపై కేసులు నమోదు చేస్తామని కడప డీఎఫ్ఓ వినీత్ కుమార్ అన్నారు. శనివారం ఒంటిమిట్ట పారెస్ట్ రేంజ్ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ శుక్రవారం తెల్లవారుజామున ఒంటిమిట్ట చెరువు కట్టపై అనుమానాస్పదంగా ఆల్విన్ లారీ వెళ్తుండటంతో ఒంటిమిట్ట ఫారెస్టు సిబ్బంది ఆపగా.. డ్రైవర్ నిలపకుండా వెళ్లాడు. దీంతో వాహనాన్ని వెంబడించారు. కొద్దిదూరంలో వాహనాన్ని వదిలేసి లారీ డ్రైవర్ పరారయ్యాడు. మినీ లారీలో స్మగ్లర్లు వదిలేసిన మొబైల్ ఫోన్ల ఆధారంగా నిందితులను గుర్తించినట్లు ఆయన తెలిపారు.త్వరలోనే వారిని పట్టుకుంటామన్నారు. ఈ కేసులో పరారైన పీలేరు జిల్లా రేగళ్ల కు చెందిన మురళి కోసం విస్తృతంగా గాలిస్తున్నట్లు కడప డీఎఫ్ఓ తెలిపారు. ఆలివ్న్ లారీలో 84 దుంగలను కూరగాయల మాటున తీసుకెళ్లేందుకు నిందితులు ప్రయత్నం చేశారు. వాటి విలువ సుమారు రూ. 11 లక్షలు ఉంటుందని తెలిపారు. అయితే బయటి మార్కెట్‌లో వీటి విలువ సుమారు రెండు కోట్ల వరకు ఉండవచ్చని సమాచారం. ఈ కార్యక్రమంలో సబ్ డీఎఫ్ఓ వివేకానంద, ఎస్ఆర్ఓ బాలసుబ్రమణ్యం, ప్రసాద్, డీఆర్ఓ నాగు నాయక్, ఎఫ్ఎస్ఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

కల్యాణ వైభోగమే..


వివాహ ముహూర్తాలు
మే నెల: 4,8,9,10,11, 14,16,18, 19,21, 23,24,30

జూన్: 2,4,5,6,7,8



- ఎటూ చూసినా పెళ్లి సందడే..!
- మొదలైన శుభ ముహుర్తాలు









మదనపల్లె సిటీ: వేసవికాలంలో కల్యాణోత్సవాల సందడి మొదలైంది.సెలవుల్లో కుటుంబంతో కలిసి పెళ్లి వేడుకలను చుట్టేసే ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. వేదమంత్రాల సాక్షిగా జీవితాన్ని పండించుకునేందుకు కొంగులు ముడివేసుకోనున్నాయి. పట్టణంతో పాటు గ్రామాల్లో సన్నాయి మేళాలు మోగనున్నాయి. ఈనెల 1 నుంచి జూన్ 8 వరకు పెళ్లి ముహుర్తాలు ఉన్నాయి. వేలాది జంటలు ఒక్కటి కానున్నాయి. జూన్ 8తో మంచిరోజులు ముగుస్తున్నాయి. జూన్ 10 నుంచి గురుమూఢమి ఆరంభమవుతుంది. జులై 24 వరకు ఆషాడమాసంలో ముహుర్తాలు లేవు. మళ్లీ జులై 25 నుంచి శ్రావణమాసం ఆరంభంతో మంచి ముహుర్తాలు ఆగస్టు 20 వరకు ఉన్నట్లు పురోహితులు పేర్కొంటున్నారు.

జిల్లాలో పెళ్లి సందడి ప్రారంభం

పెళ్లి శుభలేఖలు, కల్యాణ మండపాలకు అలంకరణలు, కొత్త దుస్తుల కొనుగోళ్లతో షాపింగ్ మాల్స్ కిటకిటలాడుతున్నాయి. జిల్లాలో మదనపల్లె, రాయచోటి, రాజంపేటతో పాటు అన్ని మండల కేంద్రాల్లో పెళ్లిళ్ల వాతావరణం కనిపిస్తోంది.

- పెళ్లిళ్లలో ప్రధానమైనది పట్టుచీరలు, బంగారం. బంగారం ఖరీదు ఎన్నడూ లేని విధంగా పెరుగుతోంది.దీంతో ఆచితూచి కొనుగోలు చేస్తున్నారు. మదనపల్లె పట్టణంలోని నీరుగట్టువారిపల్లెలో పట్టుచీరలు కొనుగోలు ఊపందుకుంది.
- పెళ్లంటేనే ఓ సందడి. నోరూరించే వంటలు, మేకప్, ఫొటో, వీడియోగ్రాఫర్లు, పురోహితులు, బాజాభజంత్రీలతో పాటు ఇలా ఎన్నో వర్గాల వారికి ప్రత్యక్షంగా,పరోక్షంగా చేతి నిండా పని దొరుకుతుంది. ఎండాకాలం కావడంతో ఏసీ కల్యాణ మండపాలకు మంచి డిమాండ్ ఏర్పడింది. కల్యాణమండపాలను నచ్చినట్లు పూలతో డెకరేషన్స్ చేయిస్తున్నారు.

రెండు నెలలు శుభ ముహుర్తాలు



ఈ రెండు నెలలు మంచి ముహుర్తాలు ఎక్కువగా ఉన్నాయి. కొందరు ఇప్పటికే నిశ్చయ తాంబూలాలు సిద్ధం చేసుకుంటున్నారు. కొన్ని ముహుర్తాలకు డిమాండ్ ఉండటంతో ముందస్తుగానే అడ్వాన్స్‌లు ఇచ్చేశారు.

–సాయిచక్రవర్తి, వేదపండితుడు, మదనపల్లె

ముందుగానే బుక్ చేసుకున్నారు



పెళ్లిళ్ల సీజన్ ప్రారంభం కావడంతో కల్యాణ మండపాలు ముందుగానే బుక్ అవుతున్నాయి. ముహుర్తాలు రెండు నెలలు ఉండటంతో అన్నింటికి డిమాండ్ ఏర్పడింది. పెళ్లి మండపాలు డెకరేషన్, కేటరింగ్‌లకు ముందుగానే అడ్వాన్సులు ఇస్తున్నారు.

–బాలగంగాధర్‌రెడ్డి, శ్రీవారి సప్లయర్స్, మదనపల్లె

నచ్చిన రీతిలో డెకరేషన్



కల్యాణ మండపాల నుంచి స్వాగత తోరణాల వరకు నచ్చిన రీతిలో డెకరేషన్ చేస్తున్నాం. ముహుర్తాలకు రోజులు దగ్గర పడటంతో బెంగళూరు, కడప, తమిళనాడు ప్రాంతాల నుంచి ప్రత్యేకంగా పూలు,డెకరేషన్ సామగ్రి ముందుగా తెచ్చుకుంటున్నాం.

–ఎంబీఎస్ బాషా, పూల వ్యాపారి, మదనపల్లె

క్లుప్తంగా

మామిడి చెట్లు దగ్ధం



కాలిపోయిన మామిడి చెట్లను చూపిస్తున్న రైతు చెంగయ్య

పుల్లంపేట : మండల పరిధి వెంగమాంబ ఆర్.గొల్లపల్లె గ్రామంలో శనివారం దాదాపు ఐదు ఎకరాల మామిడి, నిమ్మ చెట్లు దగ్ధమయ్యాయి. గ్రామ సమీపంలోని నల్లిపల్లె లలితమ్మ, రాజశేఖర్‌రావు, చెంగయ్య అనే రైతులకు చెందిన మామిడి, నిమ్మ చెట్లు కాలిపోయాయి. గుర్తు తెలియని వ్యక్తులు కంచెకు నిప్పు పెట్టడంతో.. మంటలు తోట అంతా వ్యాపించాయి. విషయ తెలిసి రైతులు వెళ్లి చూసే సరికి ఏమీ మిగలలేదు. వేసవిలో ఆకతాయిలు ఎండిపోయిన గడ్డికి నిప్పు పెడుతుండటంతో ఇలా జరుగుతోందని రైతులు పేర్కొంటున్నారు. తీవ్రంగా నష్టపోయామని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

వృద్ధురాలిపై పిచ్చికుక్క దాడి



తీవ్రంగా గాయపడిన నారాయణమ్మ

మదనపల్లె : పిచ్చికుక్క దాడిలో వృద్ధురాలు తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం మదనపల్లె మండలంలో జరిగింది. కొండామరిపల్లె పంచాయతీ బెస్తపల్లెకు చెందిన నారాయణమ్మ (70) ఇంటి ముందు కూర్చుని ఉండగా.. అకస్మాత్తుగా పిచ్చికుక్క ఆమెపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. దీంతో స్థానికులు కుక్కను వెంబడించడంతో పరిగెత్తుతూ దారి వెంట ఎదురుపడిన ఆవులు, దూడలను కరిచింది. గమనించిన కుటుంబ సభ్యులు వృద్ధురాలిని వెంటనే మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. అత్యవసర విభాగంలో చికిత్సలు అందించిన అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో.. మెరుగైన వైద్యం కోసం బాధితురాలని తిరుపతికి రెఫర్ చేశారు.

కీచక ఉద్యోగిపై విచారణ

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి టాస్క్ ఫోర్స్ : 'ఆ శాఖలో.. కీచకుడు' అనే కథనం శనివారం సాక్షిలో ప్రచురితమైంది. ఈ కథనం ఆ శాఖలో కలకలం రేపింది. వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ కార్యాలయం తోపాటు జిల్లా కలెక్టరేట్ అధికారులు ఆరా తీశారు. ఈ అంశానికి సంబంధించి ఈ నెల 5వ తేదీన ఉదయం 10.30 గంటలకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో.. విచారణకు హాజరు కావాలని జిల్లా ఎయిడ్స్, లెప్రసీ, క్షయ నివారణ అధికారి తెలిపారు. ఫిర్యాదు చేసిన వారితోపాటు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగి.. మొత్తం నలుగురిని విచారణకు పిలిచినట్లు సమాచారం. ఇప్పటికే ఈ అంశానికి సంబంధించి వాయిస్ రికార్డులు, ఇతర ఆధారాలు ఉన్నాయి. కాగా ఈ విచారణను సొంత శాఖకు చెందిన వారా లేదా ఆ శాఖకు సంబంధం లేని అధికారులా, ఎవరు విచారణ చేపడుతారో తెలియాల్సి ఉంది. జరుపబోయే ఈ విచారణపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. న్యాయం గెలవాలని ఆ శాఖకు చెందిన ఉద్యోగులు అభిప్రాయ పడుతున్నారు.

ఉపాధి పనుల్లో చేతివాటం

- దొంగ మస్టర్లతో బురిడీ
- బోగస్ హాజరుతో వేతనాలు స్వాహా
- అక్రమార్కులకు అధికారుల అండదండలు
- పనులపై కొరవడిన పర్యవేక్షణ



గాలివీడు మండలంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

గాలివీడు : గ్రామాల నుంచి వలసలను నివారించేందుకు ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకం లక్ష్యం తప్పుతోంది. క్షేత్ర స్థాయిలో ఎలాంటి పనులు చేపట్టకపోయినా.. అధికారులు, సిబ్బందికి మామూళ్లు అందితే చాలు అంతా బాగుందని ధ్రువీకరించి మమ అనిపిస్తున్నారు. ఆకస్మిక తనిఖీలు అసలే లేకపోవడంతో అధికార పార్టీ పేరు చెప్పి ఫీల్డ్ అసిస్టెంట్లు దండుకుంటున్నారు. బోగస్ మస్టర్లు వేసి నిధులు తమ ఖాతాలకు మళ్లించుకుంటున్నారు. ఉపాధి హామీ పథకం అక్రమార్కులకు కాసులు కురిపిస్తోంది. ఉపాధిలో అవినీతిని అరికట్టేందుకు ఎన్ని విధానాలు ప్రవేశ పెడుతున్నా.. వీరి దోపిడీకి మాత్రం అడ్డుకట్ట పడటం లేదు. ఆన్‌లైన్‌లోని లొసుగులను ఆసరాగా తీసుకుని దొంగ మస్టర్లు, బోగస్ హాజరుతో నిధులు స్వాహా చేస్తున్నారు. పని ప్రదేశం నుంచి కూలీల ఫొటోలను మస్టర్‌తో కలిపి ఎన్‌ఎంఎంఎస్ యాప్‌లో నమోదు చేయాల్సి ఉండగా.. ఒక చోట నమోదు చేసిన ఫొటోలనే మరో మస్టర్‌కు నమోదు చేసి సొంత లాభం చూసుకుంటున్నారు. రోజుకు సగటున ప్రతి వ్యక్తికి రూ.307 కూలీగా నిర్ణయించారు. కూలీలు చేస్తున్న పనుల్లో కొలతలు వేస్తే.. అతి తక్కువగా కూలి పడుతోంది. ఇలాగైతే అధికారులు ఒప్పుకోకపోవడంతో కూలీలు పని చేసినా, చేయకపోయినా.. అధిక కూలి వేయక తప్పడం లేదని పలువురు క్షేత్రస్థాయి సిబ్బంది బాహాటంగానే చెబుతున్నారు. గాలివీడు మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పనుల అమలు తీరు ఇలాగే ఉంది. చాలా గ్రామాల్లో చేసిన పనులనే మళ్లీ మళ్లీ చేస్తున్నారు. వేసవి కాలంలో గ్రామాల్లో సుస్థిర అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉండగా, ఎక్కువగా ప్రాధాన్యం లేని పనులు చేపడుతున్నారు. పంట కాలువల నిర్మాణం, పూడికతీత, పొలం గట్లపై మొక్కల పెంపకం, పంట కుంటలు, సరిహద్దు కందకాలు వంటి ప్రాధాన్యం ఉన్న పనుల జోలికి వెళ్లడం లేదు.

అధికారులకూ వాటాలు

ఉపాధి హామీ సిబ్బంది మస్టర్లలో హాజరు వేసిన కూలీల్లో 50 శాతం మంది మాత్రమే క్షేత్రస్థాయిలో పని చేస్తున్నారు. మరో 50 శాతం కూలీల పేరిట బోగస్ హాజరు వేస్తున్నారు. చాలా గ్రామాల్లో సగటున రోజుకు 30 మంది హాజరవుతుంటే మరో 20 మంది పేరిట బోగస్ హాజరు వేస్తున్నారు. కూలీల ముఖచిత్రాలు తీయడం లేదు. పనులకు వెళ్లని వారి జాబ్ కార్డులు తీసుకుని వారికి హాజరు వేస్తున్నారు. ఖాతాల్లో జమయ్యే వేతనాన్ని ఫీల్డ్ అసిస్టెంట్లు, జాబ్ కార్డుదారులు సగం సగం పంచుకుంటున్నారు. ఈ విషయం అధికారులు, కిందిస్థాయి సిబ్బందికి తెలిసినా.. వారికి కూడా వాటాలు చెల్లిస్తున్నట్లు పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లు స్వయంగా చెబుతున్నారు. ఒక్కొక్కరు ఐదు నుంచి పది గ్రూపుల వరకు బినామీ పేర్లతో నిర్వహిస్తున్నారు. వీరు సంబంధిత అధికారులు, సిబ్బందిని ప్రసన్నం చేసుకుని చేతివాటం చూపుతున్నట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతి గ్రూపులో పనికి రాకుండానే వేతనాలు పొందుతున్న వారు పదుల సంఖ్యలో ఉన్నారు. బిల్లులు చేయించుకునేందుకు ఉపాధి కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ మొదలు టీఏ, ఈసీ, ఏపీఓ, ఎంపీడీఓ స్థాయి వరకూ మామూళ్లు ముట్టజెబుతున్నట్లు సమాచారం.

బాధ్యులను వదిలేస్తున్నారు

క్షేత్రస్థాయిలో ఉపాధి హామీ పనులను ఫీల్డ్ అసిస్టెంట్లు, టీఏలు, ఈసీలు, ఏపీఓలు పర్యవేక్షించాలి. ఉపాధి పనుల్లో అవకతవకలు జరిగితే చర్యలు తీసుకోవాలి. సామాజిక తనిఖీల్లో అక్రమాలు బహిర్గతమై రికవరీకి ఆదేశిస్తే వెంటనే చర్యలు చేపట్టాలి. ఉపాధి హామీ నిబంధనల ప్రకారం రూ.10 వేలు రికవరీకి ఆదేశిస్తే ఫీల్డ్ అసిస్టెంట్, రూ.30 వేల రికవరీకి టెక్నికల్ అసిస్టెంట్, రూ.50 వేల రికవరీకి ఈసీలపై చర్యలు తీసుకోవాల్సి ఉంది. మండల వ్యాప్తంగా సామాజిక తనిఖీల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నా, రికవరీలకు ఆదేశిస్తున్నా బాధ్యులపై మాత్రం చర్యలు తీసుకోలేదు. దీంతో ఉపాధి హామీ పనుల్లో అక్రమాలు హెచ్చుమీరుతున్నాయి.

క్షేత్రస్థాయిలో ఇలా..

మండలంలోని కొర్లకుంట గ్రామంలో ఏప్రిల్ 2024 నుంచి మార్చి 2025 వరకు జరిగిన పనుల్లో మస్టర్ నంబర్లు 144 3897, 1443904, 1443984, 1443961, 11320350, 1319181, 1320353, 1323769, 11320354, 11322061, 11322062, 1611308, 11320352, 1319195, 1320359. వీటిని నిశితంగా పరిశీలిస్తే పలువురు పనులకు వెళ్లకపోయినా వెళ్లినట్లుగా, కొందరు బయటి ప్రాంతాల్లో వున్నా బిల్లులు పెట్టడం వంటివి చేస్తున్నారు. ముఖ్యంగా కూలీ పనులకు వెళ్లని వారికి కూడా బోగస్ హాజరు వేసి.. వచ్చిన సొమ్ములో కొంత జాబ్ కార్డు దారుడికి ఇచ్చి మిగిలిన సొమ్ము ఫీల్డ్ అసిస్టెంట్లు నొక్కేస్తున్నారు. ఇలా మండలంలోని ప్రతి పంచాయతీ పరిధిలో ప్రతి రోజు దొంగ మస్టర్లు, ఒకరి స్థానంలో మరొకరి ఫొటోలు, కూలీల హాజరును ఎక్కువగా నమోదు చేస్తూ ఉపాధి నిధులను మింగేస్తూ జేబులు నింపుకొంటున్నారు.

చర్యలు తీసుకుంటాం

ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు పాల్పడితే బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. పనులకు వచ్చే కూలీలను మాత్రమే మస్టర్ నమోదు చేసి వారి ఫొటోలనే అప్లోడ్ చేయాలి. ఎవరైనా బోగస్ మస్టర్లను నమోదు చేసినట్లుగా గుర్తిస్తే చర్యలకు వెనుకాడం.

- వెంకటరత్నం, పీడీ, డ్వామా, అన్నమయ్య జిల్లా

వరకట్న వేధింపులపై ఫిర్యాదు

పులివెందుల రూరల్ : పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని ఉలిమెల్ల గ్రామానికి చెందిన ప్రత్యూషను 2022లో సింహాద్రిపురం మండలం రావులకొలను గ్రామానికి చెందిన కుమార్‌కు ఇచ్చి వివాహం చేశారు. అప్పటి నుంచి వీరి సంసారం సాఫీగా సాగింది. ఈ మధ్యకాలంలో వరకట్నం తేవాలని భర్త కుమార్, అత్తామామలు, ఆడబిడ్డలు వేధిస్తున్నారని ప్రత్యూష శనివారం పులివెందుల అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

దువ్వూరు : మండల పరిధి చింతకుంట గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. మైదుకూరు మండలం నల్లపురెడ్డిపల్లెకు చెందిన కొంత మంది భక్తులు అహోబిలంలో మొక్కుబడి చెల్లించుకుని తిరిగి స్వగ్రామానికి బొలేరో గూడ్స్ వాహనంలో బయల్దేరారు. దువ్వూరు మండలం చింతకుంట గ్రామ సమీపంలోకి రాగానే.. వాహనం అదుపు తప్పి పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో కానే చిన్న కొండమ్మ (45), పోలు లక్ష్మీదేవిలకు తీవ్ర గాయాలు కాగా, అంకిరెడ్డిపల్లె స్వప్న, లెక్కల శ్యామల, లక్ష్మీదేవి, కొండమ్మ, శకుంతల, రామ సుబ్బమ్మ, అమర్‌నాథ్‌రెడ్డి గాయపడ్డారు. కానే చిన్నకొండమ్మ మైదుకూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయింది. గాయపడిన వారిని 108 అంబులెన్స్‌లో కడప రిమ్స్, ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్న పోలు లక్ష్మీదేవి పరిస్థితి విషమంగా ఉంది. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వినోద్ కుమార్ తెలిపారు.

కోరం ప్రకారమే ఎన్నికలు నిర్వహించాలి



ఎఫ్‌ఆర్‌వోకి వివరిస్తున్న వంగిమళ్ల నాయనివారి పల్లె గ్రామస్తులు

రాయచోటి టౌన్ : వీఎస్‌ఎస్ ఎన్నికలు కోరం ప్రకారమే నిర్వహించాలని వంగిమళ్ల గ్రామం నాయనివారిపల్లె గ్రామ ప్రజలు రాయచోటి ఫారెస్టు అధికారులకు వినతి చేశారు. శనివారం వీరబల్లి మండలం వగిమళ్ల గ్రామం నాయనివారిపల్లెలో వృక్ష సంరక్షణ సమతి(వీఎస్‌ఎస్) ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికలు సజావుగా నిర్వహించాల్సి ఉండగా.. అధికార పార్టీ నాయకుల వత్తిడికి తలొగ్గి టీడీపీకి చెందిన వారినే వీఎస్‌ఎస్ సంఘం నాయకులుగా గుర్తించారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ ఎన్నికలలో తమకు న్యాయం జరగలేదని అధికార పార్టీకి చెందిన వారినే గెలుపొందినట్లు రికార్డులలో రాసుకున్నారని, ఈ పద్ధతి సరైనది కాదని ఆరోపిస్తూ ఆ ప్రాంతానికి చెందిన అర్హత కలిగిన అభ్యర్థులు ఎఫ్‌ఆర్‌వో వై.చంద్రశేఖర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎఫ్‌ఆర్‌వో మాట్లాడుతూ కోరం ప్రకారం సభ్యులు ఉంటేనే ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పారు. మొత్తం ఓట్లలో 51 శాతం ఓట్ల శాతం ఉన్నప్పుడే ఈ ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పారు. కోరం ప్రకారం ఎన్నికలు జరగకపోతే కోర్టును శ్రయించవచ్చునని సూచించారు. దీనిపై రాయచోటి డీఎఫ్‌వో వై.చంద్రశేఖర్‌రెడ్డిని వివరణ కోరగా.. ఆ గ్రామంలో ఉన్న స్థానికుల సహకారంతో కోరం ప్రకారమే ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. దీనిపై స్థానిక ప్రజలకు అవగాహన కూడా కల్పించామని చెప్పారు. ఈ ఎన్నికలు సజావుగా జరగకపోతే, త్వరలోనే ఎన్నికల నియవాళి ప్రకారం ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పారు. ఎలాంటి రాజకీయాలకు తావు లేకుండా ఎన్నికలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

బీమా రంగంలో విదేశీ పెట్టుబడి వద్దు

కడప కల్చరల్ : బీమా రంగంలో విదేశీ కంపెనీలను అనుమతించరాదని, ఎల్‌ఐసీ ఉద్యోగుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మే 20న నిర్వహిస్తున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఎల్‌ఐసీ ఉద్యోగుల సంఘం జోనల్ సంయుక్త కార్యదర్శి జి.తిరుపతయ్య పేర్కొన్నారు. శనివారం డివిజన్ అధ్యక్షులు అవధానం శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కడప జిల్లా విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐఆర్‌డీఏ సంస్థ ప్రైవేటు ఇన్స్రూ కంపెనీలకు అనుకూలంగా పని చేస్తోందని, ఎల్‌ఐసీని బలహీన పరచే ప్రయత్నం చేస్తోందని అన్నారు. తొలుత డిమాండ్లతో కూడిన సమ్మె పోస్టర్ విడుదల చేశారు. ఈ సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.రఘునాథరెడ్డి, నాయకులు అక్బర్‌బాసా, వై.కల్యాణ్, వారిజాతమ్మ, రాజు, అయ్యవారురెడ్డి, రత్నకిషోర్, రాయచోటి, రాజంపేట, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, కడపల నుంచి పెద్ద సంఖ్యలో ఎల్‌ఐసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

పాత కక్షలే హత్యకు దారి తీశాయా?

- హత్య కేసులో సాక్షిగా ఉన్న సునీల్ కుమార్
- మృతుడి సోదరితో బాలాంజనేయులు అసభ్య ప్రవర్తన
- హత్యకు ముందు గొడవపడ్డారంటున్న సోదరి



సోదరుడి మృతదేహం వద్ద విలపిస్తున్న శశికళ



సునీల్ కుమార్ (ఫైల్)

మదనపల్లె : మదనపల్లిలో శుక్రవారం రాత్రి జరిగిన యువకుడి దారుణ హత్య ఘటనలో అనేక విషయాలు వెలుగుచూస్తున్నాయి. ముఖ్యంగా పాత కక్షలే హత్యకు దారితీసి ఉంటాయని పోలీసులు భావిస్తున్నారు. అందుకు బలం చేకూరుస్తూ మృతుడి సోదరి శశికళ శనివారం తన సోదరుడు సునీల్ కుమార్(25) హత్య ఘటనపై టూ టౌన్ పోలీసులకు.. మృతుని స్నేహితుడు పెద్దబాలి అలియాస్ బాలాంజనేయులు అలియాస్ బాల, అతని స్నేహితులపై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేసింది. చిత్తూరు జిల్లా రామకుప్పం మండలం రాజుపేటకు చెందిన సునీల్ కుమార్ మదనపల్లి మండలం బసినికొండ కాలనీలో నివాసం ఉంటున్నాడు. పట్టణంలో సోనూ అనే వ్యక్తితో కలిసి ఎలక్ట్రీషియన్ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. ఎనిమిది నెలల క్రితం శృతి అనే యువతితో వివాహం కాగా, ఇంటర్ పరీక్షలు రాసేందుకు ఆమె పుట్టింటికి వెళ్లింది. దీంతో తన సోదరి శశికళ ఇంట్లో ప్రస్తుతం ఉంటున్నాడు. ఒకటో తేదీ (గురువారం) పనులకు వెళ్లి వస్తానని అక్క శశికళతో చెప్పి బయటికి వచ్చాడు. ఆరోజు ఇంటికి వెళ్లలేదు. దీంతో శశికళ ఫోన్ చేయగా తనకు పని ఉందని, చూసుకొని తర్వాత వస్తానని చెప్పాడు. అయితే శుక్రవారం రాత్రి పట్టణంలోని శేషప్ప తోట మయూరి కల్యాణ మండపం సమీపంలోని చర్చి వెనుక వైపున చెట్టు కింద.. తల, ముఖంపై బండరాళ్లతో కొట్టడంతో తీవ్ర గాయాలై హత్యకు గురై పడి ఉండడంతోపాటు మృతుడి తల, ముఖానికి అడ్డుగా బండరాళ్లు ఉండడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు, సోదరి శశికళకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న శశికళ సోదరుని మృతదేహాన్ని చూసి తీవ్రంగా విలపించింది.

గతంలోనే పోలీసులకు ఫిర్యాదు చేసినా..

బాలాంజనేయులు అతని స్నేహితులు గౌతమ్, కమలాకర్‌లు తన తమ్ముడి హత్యకు కారకులై ఉంటారని శశికళ పోలీసులకు తెలిపింది. ఎందుకంటే తనతో బాలాంజనేయులు అసభ్యంగా ప్రవర్తించాడని, ఈ విషయం మనసులో ఉంచుకొని కక్షతో హత్య చేశారని ఆరోపించింది. రెండో తేదీ (శుక్రవారం) సునీల్ కుమార్, బాలాంజనేయులు, అతని స్నేహితులతో సంఘటన స్థలం వద్ద ఘర్షణ పడినట్లు తనకు సమాచారం ఉందని చెప్పింది. ఘర్షణ హత్యకు కారణమై ఉంటుందని పేర్కొంది. తనపై బాలాంజనేయులు అసభ్యంగా ప్రవర్తించిన సమయంలో పోలీసులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోలేదని ఆరోపించింది. కాగా ఆరు సంవత్సరాల క్రితం మండలంలోని రామాచార్లపల్లి వద్ద జరిగిన హత్య కేసులో బాలాంజనేయులు నిందితుడిగా ఉన్నాడు. అదే కేసులో సునీల్‌కుమార్ సాక్షిగా ఉన్నాడు. ఈ కేసులో తనకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పవద్దంటూ సునీల్ కుమార్‌ను బాలాంజనేయులు పలుమార్లు బెదిరించాడు. అంతేకాకుండా ఏడాది క్రితం శశికళ ఇంట్లో ఉండగా బాలాంజనేయులు ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ విషయమై సునీల్ కుమార్ బాలాంజనేయులుతో ఘర్షణపడి దాడి చేశాడు. ఈ నేపథ్యంలో పాత కక్షలే హత్యకు దారి తీసి ఉంటాయని భావిస్తున్నారు. అయితే హత్య ఘటనలో ఎంత మంది పాల్గొన్నారు? హత్యకు సంబంధించి పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

మృతదేహాన్ని పరిశీలించిన డీఎస్పీ

సునీల్ కుమార్ మృతదేహాన్ని డీఎస్పీ మహేంద్ర శనివారం ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి మార్చురీ గది వద్ద పరిశీలించారు. కుటుంబ సభ్యుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. హత్య కేసును పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసి నిందితులను త్వరలోనే పట్టుకుంటామని ఆయన చెప్పారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

Summer Classes 2025, Kadapa Handwriting, Abacus, Vedicmaths, Drawing, Spoken English.Pavans academy, Cell : 8074533990, 8374757830.

REALSTATE

ప్లాట్లు కొనబడును.నెల్లూరులోని ముత్తుకూరు రోడ్, కనుపర్తిపాడు, బుజబుజనెల్లూరు, వైపాడురోడ్ ఏరియాలలో ప్లాట్లు కొనబడును. సంప్ర: 93464 48054, 79812 46665.

TO-LET

Semi Furnished Duplex (4 BHK) for Rent Family/Off at GANJIKUNTA COLONY, Sankarapuram, Kadapa. Ph: 8861540787

FLAT FOR SALE

2 BHK Apartments @ Just Rs.19 Lakhs, Near Tirupati International Airport - AP RERA Approved Project. Contact: 9542003777, 9000117007.

SERIVCES

CHANGE OF NAME

I, Guduru Bharathi (Old name) R/at D.No:1/81,Tallapaka, Near Sivalayam, Rajampeta (MDL) Annamayya (DT), AP . I have changed my name as Balaraju Jaya Bharathi W/o Balaraju Ramashekar Raju (New name)

I, Syed Mahaboob Jan (Old Name) R/at Guttameedha Sahib varipalli, Kurabala Kota, Mudiveedu, Annamayya (DT), AP. I have changed my name as Shaik Mahaboob Jan W/o Shaik Mahaboob Basha (New name)

I, Yamasani Siva Kumar (Old Name) S/o Yamasani Subbarami Reddy. R/at D.No: 2/77, Venkata Reddy Palli, S Upparapalli, Kodur, YSR Kadapa (DT), AP. I have changed my name as Yamasani Siva Kumar Reddy (New Name)

NEUROLOGIST

డా॥M.సుధాకర్‌రావు, M.D (Gold Medalist) D.M. (Neurology) అన్ని రకముల మెదడు, వెన్నుపూస,నరముల జబ్బులు చూడబడును, సుధాకర్ న్యూరో క్యూర్, రెడ్డి & రెడ్డి కాలనీ, వెంకటరమణ హాస్పిటల్ ప్రక్కన,తిరుపతి, 0877-2250600,9949916060.

WANTED

ప్రభుత్వ సంస్థలలో అవుట్ సోర్సింగ్ ద్వారా అటెండర్స్, రికార్డ్ అసిస్టెంట్స్, కంప్యూటర్ Op., & Pvt. Bank జాబ్స్ కలవు. A:18 to 42, Sal: 18,000 to 24,000. 96032 55559.

మా ఐ హాస్పిటల్ నందు పని చేయుటకు Male స్టాఫ్ కావలెను, నాగరాజుపేట, కడప అర్హత 10th పాస్ సెల్ : 9054994220.

WANTED FEMALE TELECALLERS Q : ANY DEGREE, EXP /FRESHER LOCATION : RTC COLONY, KADAPA SALRY : 10,000 TO 15,000 PH : +91 8555963025

శివకార్తికేయ హోంకేర్‌లో వృద్ధులను,పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావాలి. ఫ్రీ వసతి భోజనం. జీ: 18K. ఫోన్: 9912011499, 9912011899

CBSE School Rajampet needs Primary & Higher Telugu,Hindi, English, Maths Teachers. Male & Female Wardens. Free food accommadation Contact: 9100190500

కష్టమైనా కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/ పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP&డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు-40వేలు.ఫ్రీరూం+భోజనం.Hyd.9182260297

GMR స్కూల్ (కడప)లో పనిచేయుటకు అనుభవజ్ఞులైన ప్రీ- ప్రైమరీ, ప్రైమరీ, ప్రైమరీ (1to5)& హైస్కూల్ (6 to 10) టీచర్లు, (అన్నిసబ్జెక్టులకు) హాస్టల్ వార్డెన్, అడ్మిషన్స్ చేయుటకు PROలు కావలెను. సంప్ర: 9900041111,7382183100

WANTED Qualified Teachers In MONTFORT SCHOOL WALK in INTERVIEW on 12 ,13 May 2025 9.00 - 12.00 Only. Teachers For : Pre Pri : LKG & UKG, Primary : SCIENCE, SOCIAL, High School : ENGLISH, MATHEMATICS. Come Along With Your Resume Send Your Resume in Email montfortschool kadapa@gmail.com Ph : 7995351591

Wanted: 1.Floor Managers(M) (min 3yrs exp. req. fancy sarees sales), 2.Security Supervisor (M) (min 3yrs exp security operations), 3.Sales executives (M/F), 4.Cashiers (M/F). DRESS CIRCLE, kotireddy circle, Kadapa.

విజయవాడలో A/C Rental Events కంపెనీకి డ్రైవింగ్ తెలిసిన హెల్పర్స్, A/C టెక్నీషియన్స్ కావలెను. జీ: 20-25000/- భో+వసతి+ఫ్రీ ట్రైనింగ్. 99660 44671

షిరిడీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో లేడీ సూపర్‌వైజర్స్, నర్సులు, ఆయాలు, భార్యాభర్తలు డ్రైవర్స్ కావలెను. Ph: 9391036931, 9246585901

సాక్షి క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించండి
9705907418
9705944423
9010223797
9010072409

అశ్వవాహనంపై హరిహరులు

- వైభవంగా గ్రామోత్సవాలు
- కనుల పండువగా బ్రహ్మోత్సవాలు



అశ్వ వాహనంపై చెన్నకేశవస్వామి వారి ఊరేగింపు



అశ్వ వాహనంపై దర్శనమిస్తున్న కామాక్షీ వైద్యనాథేశ్వరస్వామి

వల్లూరు : పుష్పగిరిలోని శ్రీ కామాక్షీవైద్యనాథేశ్వరస్వామి, శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం రాత్రి శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి, శ్రీ కామాక్షీ వైద్యనాథస్వాములు అశ్వ వాహనాలపై ఆశీనులై భక్తులకు దర్శనమిచ్చారు. మొదట పుష్పగిరి గ్రామంలోని శ్రీ కామాక్షీ వైద్యనాథస్వామి అశ్వ వాహనంపై కొలువు దీరగా.. మంగళ వాయిద్యాలు, దివిటీల వెలుగులతో మాడ వీధుల్లో గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం కొండపైన గల శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి అశ్వ వాహనంపై కొలువు దీరి విహరించారు. కొండపై నుంచి స్వామి వారిని పెన్నానది మీదుగా పల్లకీలో మోస్తూ గ్రామంలోని మాడ వీధులలో ఘనంగా ఊరేగించారు. ఉదయం శ్రీ వైద్యనాథస్వామి ఆలయంలో స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలను నిర్వహించారు. శ్రీ చక్ర సహిత కామాక్షీ అమ్మవారికి కుంకు మార్చనలు చేశారు. శ్రీ చెన్నకేశవస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు అఖిల్ దీక్షితులు ఆధ్వర్యంలో యాగశాల పూజలు, వివిధ హోమాలు నిర్వహించారు. బలి హరణ కార్యక్రమం చేపట్టారు. స్వామి వారికి, లక్ష్మీదేవికి ప్రత్యేక అలంకరణ చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు చక్రస్నానం

పుష్పగిరి బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం ఉదయం వైద్యనాథస్వామి త్రిశూలం, చెన్నకేశవస్వామి సుదర్శన చక్ర స్నానం జరుగుతుంది. అనంతరం రెండు ఆలయాల్లో పూర్ణాహుతి, ధ్వజ అవరోహణం కార్యక్రమాలు జరుగుతాయి. సాయంత్రం 4.30 గంటల నుంచి శ్రీ లక్ష్మీచెన్నకేశవ ఆలయంలో పుష్పయాగం నిర్వహిస్తారు. రాత్రి 7 గంటలకు శ్రీ కామాక్షీ వైద్యనాథస్వామి ఆలయంలో రావణేశ్వర వాహన సేవ ఉంటుంది. అనంతరం శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామికి తిరుచ్చి వాహన సేవ జరుగుతుంది.

సంచులకు నిప్పు.. తప్పిన పెను ప్రమాదం



అగ్ని ప్రమాదంలో కాలిపోయిన గోనె సంచులు



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

వేంపల్లె : స్థానిక పులివెందుల రోడ్డులోని కందుల కాంప్లెక్స్ వెనుక ఉన్న రేకుల షెడ్డులో గోనె సంచులకు అగ్ని అంటుకుంది. వెంటనే అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది వచ్చి మంటలను ఆర్పడంతో పెను ప్రమాదం తప్పింది. కందుల కాంప్లెక్స్ వెనుక కూరగాయలకు చెందిన వ్యాపారులు షెడ్లు వేసుకుని వాటిలో పాత గోనె సంచులు, టమాటా ట్రేలను పెట్టుకున్నారు. శనివారం గోనె సంచులు ఉన్న రేకుల షెడ్డులో మంటలు వస్తున్న విషయాన్ని స్థానికులు గమనించి ఫైర్ స్టేషన్‌కు సమాచారమిచ్చారు. దీంతో హుటాహుటిన సంఘటనా స్థలానికి ఫైర్ సిబ్బంది చేరుకుని మంటలను అదుపు చేశారు. పక్కనే ఉన్న మరో రేకుల షెడ్డులో రోగులు, ఆస్పత్రులకు సప్లయ్ చేసే ఆక్సిజన్‌కు చెందిన సిలిండర్లకు మంటలు అంటుకొనే లోపలే.. అదుపు చేయడంతోపాటు సిలిండర్లపై నీటిని చల్లారు. ఎండలు తీవ్రంగా ఉండటంతో మంటలను అదుపులోకి తెచ్చేందుకు స్థానికులు, ఫైర్ సిబ్బంది చాలా కష్టపడ్డారు. మంటల్లో మోటార్ బైకు కాలిపోయింది. ఎగిసి పడుతున్న మంటలను అదుపు చేయడం వల్ల పెద్ద ప్రమాదం తప్పిందని, లేకపోతే ఆక్సిజన్ సిలిండర్లు మంటలకు పేలి ఉంటే ప్రజలు మృత్యువాత పడే అవకాశం ఉండేదని స్థానికులు వాపోతున్నారు. సహాయక చర్యల్లో అగ్నిమాపక శాఖ అధికారి శివరామిరెడ్డి, ఫైర్ సిబ్బంది ఎస్.ఎం.డి. సాలర్, మహమ్మద్ రఫీ, సురేంద్ర రెడ్డి, నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.